మొక్కజొన్న పొలంపై అడవి పందుల దాడులు 5





# ప్రజాజ్యోతి

నిజామాబాద్ కామారెడ్డి

ఆదివారం । 24 । ఆగస్టు । 2025 । పేజీలు 5





సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి 5


## • మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 6.90లక్షలు

కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 23. (ప్రజాజ్యోతి) బిచ్కుంద మండలంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో 300 మందికి సరిపడు టాయిలెట్స్ లేక విద్యార్థులు ఇబ్బంది ఎదుర్కొంటున్నారని జిల్లా కలెక్టర్ దృష్టికి రావడం జరిగింది. దీనితో జిల్లా కలెక్టర్ విద్యార్థుల అవసరం దృష్ట్యా జహీరాబాద్ పార్లమెంట్ నియోజక వర్గ ( ఎంపీ లాడ్స్) నిధుల నుండి 10 టాయిలెట్స్ బ్లాక్ నిర్మాణానికి 6,90,000 రూపాయలు శాంక్షన్ చేసి విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండేలా మరుగుదొడ్లను నాణ్యతతో వేగంగా నిర్మించి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకువచ్చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాధికారి రాజు ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ప్రత్యేక చొరవతో నిధులు విడుదల చేసిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు మరియు గ్రామస్థులు జిల్లా కలెక్టర్ కు కృతజ్ఞతలు తెలియజేశారు.

# నవరాత్రులను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి

### జిల్లా ఎస్పి యం. రాజేశ్ చంద్ర గణేష్ మండపాల నిర్వాహకులకు సూచన

కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 23. (ప్రజాజ్యోతి) గణేష్ నవరాత్రి ఉత్సవాలు మరియు శోభాయాత్రల సందర్భంగా ప్రజల భద్రత, శాంతి పరిరక్షణ కోసం కామారెడ్డి కళాభారతీ ప్రాంగణంలో సన్నాహక సమావేశం నిర్వహించబడింది. ఈ సమావేశంలో జిల్లా ఎస్పి యం. రాజేశ్ చంద్ర, జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) శ్రీ విక్టర్, మున్సిపల్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ పెద్దలు పాల్గొన్నారు. జిల్లా ఎస్పి యం.రాజేశ్ చంద్ర, మాట్లాడుతూ గణేష్ ఉత్సవాలు అందరూ కలిసి స్నేహపూర్వకంగా, ప్రశాంత వాతావరణంలో జరగాలని ఆకాంక్షించారు. మండపాల ఏర్పాటులో నిర్వాహకులు పూర్తి బాధ్యత వహించాలని సూచిస్తూ, ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. గణేష్ ఉత్సవ నిర్వాహకులు మరియు వాలంటీర్ల వివరాలతో పాటు వివిధ కార్యక్రమాల సమాచారాన్ని ఆన్‌లైన్ అప్లికేషన్‌లో నమోదు చేయాలని సూచించారు. ప్రజా రవాణా, ఎమర్జెన్సీ వాహనాలకు ఇబ్బంది కలగకుండా మండపాలను ఏర్పాటు చేయాలని, కమిటీ బాధ్యత వహించే వారి పేర్లు, ఫోన్ నంబర్లు ప్రదర్శించాలని సూచించారు. మండపాల వద్ద 24 గంటలు వాలంటీర్లు అందుబాటులో ఉండాలని, భక్తుల కోసం క్యూలైన్లు ఏర్పాటు చేయాలని తెలిపారు. రాత్రి 10 గంటల తర్వాత స్పీకర్ల వినియోగం లేదు అలాగే డీజే వాడకం పూర్తిగా నిషేధించబడింది. అగ్నిప్రమాదాల నివారణకు ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, ఫైర్ బాల్స్ లేదా నీటి బకెట్లు తప్పనిసరిగా ఉంచాలని సూచించారు.అలాగే మద్యం సేవించడం, పేకాట, అసభ్య నృత్యాలు, ఇతర మతాలను కించపరిచే పాటలు లేదా ప్రసంగాలు పూర్తిగా నిషేధించబడ్డాయి. సాంస్కృతిక కార్యక్రమాలతో ఉత్సవాలు నిర్వహించుకోవాలని సూచించారు. ప్రతి మండపంలో తనిఖీ పుస్తకం ఉంచి, అధికారులు తనిఖీ చేసినప్పుడు సంతకాలు చేయాలని ఆదేశించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా వస్తువులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. దీపాల వల్ల ప్రమాదాలు జరగకుండా ఇసుక/బియ్యం పై ఉంచాలని, వర్షాకాలంలో షార్ట్ సర్క్యూట్‌లను నివారించేలా విద్యుత్ వ్యవస్థను నిపుణులచే సక్రమంగా చేయించుకోవాలని సూచించారు. పరదాలు గాలికి ఎగిరి దీపం తగిలే ప్రమాదం లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్రీ విక్టర్, జిల్లా అదన ఎస్పి కె. నరసింహారెడ్డి, ఏఎస్పి బి. చైతన్య రెడ్డి, మున్సిపల్ అధికారులు, జిల్లా ఉన్నతాధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు, గణేష్ ఉత్సవ కమిటీ సభ్యులు, పట్టణ పెద్దలు పాల్గొన్నారు.



## త్రిలింగేశ్వరా ఆలయంలో కొండచిలువ



నాగిరెడ్డిపేట్,ఆగష్టు23(ప్రజాజ్యోతి): నాగిరెడ్డిపేట్ మండలంలోని తాండూర్ త్రిలింగేశ్వరా ఆలయంలో శ్రావణ శనివారం భక్తులు పూజలు చేస్తున్న క్రమంలో స్వామి వారి గర్భగుడిలో కొండచిలువ ప్రత్యక్షమైనట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.దింతో ఆలయ కమిటీ సభ్యులు వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం అందించారు.దింతో ఫారెస్ట్ రేంజ్ అధికారి వాసుదేవరావు తన సిబ్బందితో ఆలయానికి వెళ్లి కొండచిలువను బంధించి రిజర్వు ఫారెస్ట్ లోని ఊత్తచెరువు ప్రాంతంలో సురక్షితంగా విడిచిపెట్టారు.

## ఫుడ్ ఫెస్టివల్ అదరహో



ఎల్లారెడ్డి, ఆగస్టు 23,(ప్రజా జ్యోతి) ప్రజలు బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకుని సంపూర్ణ ఆరోగ్యంగా ఉండాలని, ఎల్లారెడ్డి మున్సిపల్ కమిషనర్ ఎ.మహేష్ కుమార్ సూచించారు. శనివారం స్థానిక బస్టాండులో సీడీఎంఎ ఆదేశాల మేరకు 100 రోజుల కార్యక్రమంలో భాగంగా మెప్మా అధ్వర్యంలో "ఫుడ్ ఫెస్టివల్" ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మెప్మా ఆర్పిలు స్వయంగా తయారు చేసుకుని తీసుకు వచ్చిన ఆహార పదార్థాలు స్వీట్ కార్న్, గుడాల్, చపాతి, వంకాయ కర్రీ , టీ, పకోడీ, జిలేబి, మిర్చి, బాదుషా, లడ్డు లను ప్రదర్శించారు. మున్సిపల్ కమిషనర్, టి పి ఓ భూపతి, వార్డు అధికారులు సూర్యవర్ధన్, అంజయ్య, శేఖర్ , జ్యోతిలు వాటిని రుచి చూశారు. పిదప కమిషనర్ మాట్లాడుతూ...ముఖ్యంగా వీధి వ్యాపారులను బలోపేతంచేయడం కోసం వారికి బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించి, ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తుందని అన్నారు. ప్రజలు ఆరోగ్యవంతంగా ఉండటం కోసం బలవర్ధకమైన ఆహారాన్ని తీసుకుని సంపూర్ణ ఆరోగ్యవంతులుగా ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ వాసంతి , ప్రదీప్ కుమార్, మెప్మా ఆర్పీలు సోనీ, రేఖ, స్వప్న, సవిత, భవాని, అంజయ్య, కిరణ్, వార్డ్ అధికారులు, వీధి వ్యాపారులు , ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా ఎడ్ల పొలాల అమావాస్య

సదాశివనగర్ ఆగస్టు 23 (ప్రజాజ్యోతి) సదాశివనగర్ మండలంలోని గ్రామాలలో శనివారం రైతులు ఎడ్ల పొలాల అమావాస్య పండగను ఘనంగా జరుపుకున్నారు. నాట్లు వేసిన తర్వాత వచ్చే తొలకరి పండుగ కావడంతో రైతులు అనాదికాలంగా పొలాల పండుగను ఘనంగా జరుపుకుంటున్నారు. అన్నదాతకు సాగులో తోడుండే బసవన్నలకు ఉదయాన్నే శుభ్రంగా కడిగి పూలదండలు, గజ్జెలతో ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు చేసి నైవేద్యాలు సమర్పించారు. దేవాలయాల్లో ఎడ్లతో ప్రదక్షిణలు చేయించి మొక్కులు చెల్లించుకున్నారు. ఎడ్ల ప్రతిమలను ఇండ్లలో ప్రతిష్టించి పూజలు చేశారు. గ్రామాలలో రైతులు ఆనందోత్సవాల మధ్య పండగను జరుపుకున్నారు



## ప్రభుత్వ భూముల ఆక్రమణపై సిపిఎం ఆగ్రహం

**ఎల్లారెడ్డి ఆర్డీఓకు ఫిర్యాదు**

గాంధారి ఆగష్టు 23(ప్రజాజ్యోతి) గాంధారి మండలంలోని మతు సంగం గ్రామంలో ప్రభుత్వ భూములను బలవంతంగా ఆక్రమిస్తున్న భూస్వాములపై సిపిఎం పార్టీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఎల్లారెడ్డి ఆర్డీఓ పార్థ సింహ రెడ్డి కు ఫిర్యాదు చేసిన సిపిఎం ఎల్లారెడ్డి ఏరియా కార్యదర్శి మోతి రామ్ నాయక్ మాట్లాడుతూ %-% ప్రభుత్వ అధికారులు పలుమార్లు హెచ్చరించినా కూడా భూస్వాములు వందల ఎకరాలను తమ స్వాధీనంలోకి తీసుకుని పామ్ ఆయిల్ తోటలు సాగు చేస్తున్నారని ఆరోపించారు.గత పది ఏళ్లుగా సర్వే నంబర్లు 119, 175లో సాగుచేసుకుంటున్న దళిత, గిరిజన రైతులను బెదిరించి వెళ్లగొట్టారని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికే 60 ఎకరాల భూమిని బలవంతంగా గుంజుకొని పామాయిల్ తోటలు వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.మూడు రోజుల క్రితం జేసీ ఆదేశాల మేరకు ఆర్డీఓ స్వయంగా ఆ భూమిని సందర్శించి సర్వే చేస్తామని హామీ ఇచ్చినప్పటికీ, అక్రమ దున్నక కొనసాగుతోందని మోతి రామ్ నాయక్ తీవ్రంగా విమర్శించారు. ప్రభుత్వ హెచ్చరికలను బేఖాతరు చేస్తూ సాగు కొనసాగిస్తే చూస్తూ ఎలా ఊరుకుంటారని ప్రశ్నించారు.ప్రభుత్వం తక్షణమే జోక్యం చేసుకోకపోతే, సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టక తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మధు, ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

## యువత రవికుమార్‌ను ఆదర్శంగా తీసుకోవాలి జువ్వాడి గ్రామస్తులు

గాంధారి ఆగష్టు 23(ప్రజాజ్యోతి ) గాంధారి మండలంలోని జువ్వాడి గ్రామానికి చెందిన రవికుమార్ మరోసారి ప్రతిభను చాటుకున్నారు. ఇప్పటికే 6 ప్రభుత్వ ఉద్యోగాలకు అర్హత సాధించిన ఆయన, ఇటీవల జరిగిన గ్రూప్%-%2 పరీక్షల్లో కూడా ఎంపికయ్యారు. ఈ విజయంతో గ్రామంలో సంతోషం నెలకొనగా, శనివారం గ్రామస్తులు ఘనంగా సన్మానం చేశారు.ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ %-% పేదరికం మధ్య జన్మించిన రవికుమార్ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుని, కష్టపడి చదువుతో విజయాలను సాధించడం యువతకు ఆదర్శమని అన్నారు. పేదరికం చదువుకు అడ్డంకి కాదని ఆయన నిరూపించారని, యువత కూడా కృషి చేస్తే ప్రభుత్వ ఉద్యోగాల్లో రాణించగలరని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ గుర్రం బాలయ్య, కాంగ్రెస్ సీనియర్ నాయకులు బద్దం వెంకట్ రెడ్డి, బీజేపీ జిల్లా కౌన్సిల్ మెంబర్ జువ్వాడి శ్రీకాంత్, గ్రామ అధ్యక్షుడు శ్యామ్, కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడు భూమేష్, గుర్రం సంతోష్, చాకలి సాయిలు, బద్దం రాజారెడ్డి, మోహన్, సంతోష్, గంగారాం, మహేందర్, అన్వేష్, భాను సాగర్, ప్రవీణ్, సాగర్, విజయ్ తదితరులు పాల్గొనరు.

## ఉరివేసుకుని మహిళ ఆత్మహత్య

సదాశివనగర్ ఆగస్టు 23 (ప్రజాజ్యోతి) సదాశివనగర్ మండలం ధర్మరావుపేట గ్రామానికి చెందిన వడ్డే పుష్ప (40) శుక్రవారం రాత్రి ఇంట్లో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మృతురాలు భర్త కిషన్ దుబాయ్ లో పనిచేస్తున్నారు. భర్త కుటుంబ సభ్యుల నుండి నిరంతరం వేధింపులకు గురి చేస్తున్నట్లు ఆ వేధింపులు భరించలేక మానసిక మనోవేదనకు గురై ఆత్మహత్యకు పాల్పడినట్లు తెలిపారు. శవాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చెస్తున్నారు

## రైతులపై రాజకీయం చేయడం సరికాదు

**యూత్ అధ్యక్షుడు సంతోష్ నాయక్**



ఎల్లారెడ్డి ఆగష్టు – 23(ప్రజా జ్యోతి ) ప్రతిపక్ష పార్టీలు రైతులపై రాజకీయం చేయడం సరికాదని ఎల్లారెడ్డి మండల యూత్ అధ్యక్షుడు సంతోష్ నాయక్ శనివారం విలేకరులతో అన్నారు.కేంద్ర ప్రభుత్వం తెలంగాణకు కేటాయించవలసిన రసాయన ఎరువులను కేటాయించకుండా, సరఫరా చేయకపోవడం దారుణమని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాలకు యూరియాను సరఫరా చేసి, తెలంగాణ రాష్ట్రానికి రావలసిన వాటా కంటే తక్కువ యూరియ సరఫరా చేసి రైతులపై రాజకీయం చేయటం మానుకోవాలని సూచించారు. తెలంగాణ రైతులకు కావలసిన యూరియా వాటాను కేంద్ర ప్రభుత్వం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. రైతుల పట్ల రాజకీయ పార్టీలు, రాజకీయం చేయడం సరికాదని, ఏది ఏమైనా పార్టీలకతీతంగా బీజేపీ ప్రజాప్రతి నిధులు సంబంధిత కేంద్ర మంత్రి వద్దకు అఖిలపక్షాన్ని తీసుకెళ్లి రాష్ట్రానికి రావలసిన రసాయన ఎరువులను వచ్చేలా కృషి చేయాలని ఎల్లారెడ్డి మండల యూత్ అధ్యక్షుడు సంతోష్ నాయక్ డిమాండ్ చేశారు.

## ఆవిష్కరణ



కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 23. (ప్రజాజ్యోతి) కామారెడ్డి పట్టణ కేంద్రంలో ఒక టీవీ కొత్త ఆలోచనకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రస్తుత సమాజంలో ఎక్కువగా జరుగుతున్న ప్రమాదాలలో మద్యం సేవించి వాహనం నడపడం అలాగే మొబైల్ మాట్లాడుతూ వాహనాలు నడిపించడం ఇటువంటి తరహా ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ట్రాఫిక్ నిబంధనలను దృష్టిలో పెట్టుకొని ఒక టీవీ స్టిక్కర్లను తయారు చేయించారు. ఆ స్టిక్కర్లను జిల్లా సూపరిండెంట్ ఆఫ్ పోలీస్ రాజేష్ చంద్ర ఆవిష్కరించారు. ఇట్టి కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ శ్రీనివాస్ రెడ్డి డిఎస్పి చైతన్య రెడ్డి అడిషనల్ కలెక్టర్ విక్టర్, పట్టణ సిఐ నరహరి, డిసిసి జనరల్ సెక్రెటరీ కిరణ్ ల చేతుల మీదుగా ఆవిష్కరించారు.

## మ్యుటేషన్ దరఖాస్తు మాయం...!

సదాశివనగర్ ఆగస్టు 23 (ప్రజాజ్యోతి) సదాశివనగర్ మండలం ధర్మారావుపేట సొసైటీ భూమి మ్యుటేషన్ కోసం గత 5 సంవత్సరాలుగా గ్రామస్తులు పోరాటం చేశారు. కామారెడ్డి జిల్లాకు ఇప్పటి వరకు పనిచేసిన 4గురు కలెక్టర్లకు వినతి పత్రాలు ఇచ్చిన ఇప్పటికీ మ్యుటేషన్ కావడం లేదు. సరికదా ధరణి పోర్టల్ ఉన్నప్పుడు దరఖాస్తు చేసుకున్న ఫైల్ దొరకడం లేదు, గత మే నెలలో ధరణి పోర్టల్ లో మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేయడమైనది. అట్టి భూమి నలుగురి పేర్ల మీద ఉండడంతో నాలుగు దరఖాస్తులు చేశారు. అందులో రెండు దరఖాస్తులు 0-05 గుంటల చొప్పున పది గుంటల వేరే వ్యక్తుల వద్ద భూమి ఉందని డబుల్ రిజిస్ట్రేషన్ చేశారని రిజెక్ట్ చేశారు. మిగతా రెండు దరఖాస్తులలో ఇంకా మ్యుటేషన్ కాకపోవడంతో తాసిల్దార్ కార్యాలయంలో అడిగితే ఆర్డీవో కార్యాలయ%శీ%కు పంపించమని, ఆర్డీవో కార్యాలయ అధికారులను అడిగితే ఇక్కడ ఒక్కటే ఫైల్ ఉంది ఇంకో ఫైల్ లేదని, దాన్ని తిరిగి తాసిల్దార్ కార్యాలయంకు పంపించమని చెబుతున్నారు.

నేను తాజా మాజీ ఎంపీటీసీ మహిపాల్ యాదవ్ ను గెలిచినప్పటి నుండి పోరాడుతున్న మొదట్లో అయితే రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ మాయం చేశారు. నేనే ఎస్ ఆర్ ఓ ఆఫీస్ లో దరఖాస్తు చేసి వెతికించి తెచ్చిన ప్రభుత్వ భూమిని ప్రభుత్వం మ్యుటేషన్ చేసుకోవడానికి ఎందుకు అలసత్వం చేస్తోందో అర్థం కావడం లేదు. గతంలో ఒక ఎమ్మార్వో అయితే సొసైటీ భూమి గురించి నీకెందుకు దాని గురించి సొసైటీ వాళ్ళే అడగాలి అని మొహం మీదనే చెప్పిండు అని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు అలసత్వం వీడి మ్యూటేషన్ చేయాలని కోరుతున్నారు

## అమలుకు నోచుకోని 6 గ్యారంటీలు: బిజెపి

భిక్కనూరు ఆగస్టు 23 (ప్రజా జ్యోతి) బిక్కనూరు మండలంలోని తహసిల్దార్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన తెలిపిన బిజెపి నాయకులు మరియు కార్యకర్తలు.అందులో భాగంగా తహసిల్దార్ సునీత దేవి కి వినతి పత్రం సమర్పించారు.ఇందులో ప్రధానంగా తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం కోసం ప్రజలను పథకాల పేరుతో ఓట్లు వేయించుకొని అధికారంలోకి రాగానే ప్రజలను పట్టించుకోకుండా నామమాత్రపు 6 గ్యారంటీల పథకాలు అమలు చేస్తూ అధికారం కోసం అడ్డగోలు హామీలు ఇచ్చి ప్రజలను మభ్య పెట్టారని, రైతు రుణమాఫీ చేస్తామని చెప్పి ఇప్పటివరకు కనీసం 30% కూడా పూర్తిస్థాయిలో రుణమాఫీ చేయకపోగా, తాము ఏదో రైతుల కోసం పోరాటం చేస్తున్నట్టు ప్రచారం చేస్తున్నారు. అదేవిధంగా వంట గ్యాస్ మీద ఇచ్చిన సబ్సిడీ కూడా దిక్కు లేదని మండిపడ్డారు .ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఉప్పరి రమేష్, ప్రధాన కార్యదర్శి ఆతెల్లి తిరుమలేష్, పొన్నాల రంజిత్ ,కామరెడ్డి అసెంబ్లీ కన్వీనర్ గుంట లక్ష్మారెడ్డి, జిల్లా జనరల్ సెక్రెటరీ నరేందర్ రెడ్డి, మండల ఉపాధ్యక్షులు ఏక్ నాథ్ ,బాలింగం, బసవ రెడ్డి మరియు బిజెపి కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఎకరాకు రూ.40 వేల నష్టపరిహారం అందించాలి

నాగిరెడ్డిపేట్,ఆగష్టు23(ప్రజాజ్యోతి): గత వారం రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలో నష్టపోయిన రైతులకు ప్రభుత్వం వెంటనే నష్ట పరిహారం అందించాలని శనివారం నాగిరెడ్డిపేట్ మండల కేంద్రంలో తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ శ్రీనివాస్ రావుకు బీజేపీ నాయకులు వినతి పత్రం అందజేశారు.ఈ సందర్భంగా ఎగువ ప్రాంతంలో కురిసిన భారీ వర్షాలకు సింగూర్ ప్రాజెక్ట్ నుండి నీటిని వదలడంతో మండలంలోని మంజీరా నది పరీవాహక ప్రాంతంలో ఛీనూర్,వాడి, లింగంపల్లి,బంజారా,మాటూర్,మసాన్ పల్లి, వెంకంపల్లి ఆత్మకూర్, తాండూర్,గోలిలింగాల,మాల్తుమ్మెద తదితర గ్రామాలల్లో సుమారు 3 వేల ఎకరాల వరి పంట నీట మునిగిందని,నీట మునిగిన పంటకు ఎకరాకు రూ. 40 వేలు నష్ట పరిహారం అందించాలని వినతి పత్రంలో వారు పేర్కొన్నారు.గత బిఆర్ఎస్ ప్రభుత్వం ఫసల్ బీమా యోజన పథకాన్ని అమలు చేయకుండా రైతుల పక్షపాతిగా వ్యవహరించదని ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం మేలుకొని ఫసల్ బీమా పథకాన్ని అమలుపరిచి అకాల వర్షాల నుంచి రైతుల గోసను తీర్చాలని రైతుల పక్షాన ప్రభుత్వ వాటానూ చెల్లించాలని భారతీయ జనతా పార్టి తరపున వారు డిమాండ్ చేసారు.ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీనివాస్,ఉపాధ్యక్షులు ఈశ్వర్ గౌడ్,గోపాల్,జిల్లా కార్యవర్గ సభ్యుడు హన్మాండ్లు,ప్రధాన కార్యదర్శి కిషన్ నాయకులు అంజయ్య, సిద్ధిరాములు,కృష్ణ,విష్ణు,రాజు, ప్రవీణ్,రమేష్,మల్లేష్,అశోక్ బూత్ అధ్యక్షులు రాములు,గోపాల్, అనిల్ రెడ్డి,బాలు నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మార్వో రేణుక చౌహాన్ కు బీజేపీ వినతిపత్రం

గాంధారి ఆగష్టు 23(ప్రజాజ్యోతి)గాంధారి మండలంలో స్థానిక ప్రజా సమస్యల పరిష్కారానికి బీజేపీ నేతలు శనివారం మండల తహసీల్దార్ రేణుకా చౌహన్‌కు వినతిపత్రం అందజేశారు. రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు మండల బీజేపీ అధ్యక్షులు మధుసూదన్ రావు ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది.ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ %-% ఇటీవల అకాల భారీ వర్షాల కారణంగా నష్టపోయిన పంటలను ప్రభుత్వం తక్షణమే పరిశీలించి రైతులకు తగిన పంట నష్టపరిహారం అందించాలన్నారు. అదేవిధంగా ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని విమర్శించారు.మొదటి సంతకంతో రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం ఇప్పటి వరకు రెండు లక్షల రుణమాఫీని ఏ గ్రామంలోనూ అమలు చేయలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి ఆడబిడ్డకు తులం బంగారం, కళాశాలకు వెళ్లే విద్యార్థినులకు స్కూటీలు, రైతు కూలీలకు సంవత్సరానికి రూ. 12,000 చెల్లించాలన్న హామీలు కూడా నెరవేరలేదని నేతలు ఎద్దేవా చేశారు.ఈ కార్యక్రమంలో గిరిజన మోర్చా రాష్ట్ర నాయకులు మోజి రామ్, బీజేవైఎం జిల్లా కార్యదర్శి ప్రభాకర్, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు కూచి సంజీవులు, సీనియర్ నాయకులు సాయి గౌడ్, మండల ఉపాధ్యక్షులు మాణిక్ రావు, శ్యామ్, రాజేందర్, కిషన్ తదితర బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనరు



# మహిళల ఆర్థికాభివృద్ధికి స్త్రీనిధి రుణాలు

**ఆర్ఎం కిరణ్ కుమార్**

నాగిరెడ్డిపేట్,ఆగస్టు23(ప్రజాజ్యోతి): స్త్రీనిధి రుణాల ద్వారా మహిళలు చిరు వ్యాపారులతో ఆర్థికాభివృద్ధి చెందుతున్నారని శ్రీనిధి రీజినల్ మేనేజర్ కిరణ్ కుమార్ తెలిపారు.శనివారం నాగిరెడ్డిపేట మండల కేంద్రంలో చిరువ్యాపారులకు శ్రీనిధి కింద రుణాలు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనిధి కింద నాగిరెడ్డిపేట మండలంలో ఆర్థిక సంవత్సరంలో 2 కోట్ల 11 లక్షల రూపాయల రుణాలను అందించాలని లక్ష్యంగా ఉందని ఇప్పటివరకు 40 లక్షల రుణాలు అందించామని,జిల్లాలో 95 కోట్ల స్త్రీనిధి రుణాలు ఇవ్వాలని లక్ష్యంగా ఉందని ఇప్పటివరకు 30 కోట్ల వరకు రుణాలు ఇచ్చినట్లు ఆయన తెలిపారు. మహిళా సంఘాలకు బ్యాంకుల ద్వారా స్త్రీనిధి ద్వారా ఎంతో సహాయ సహకారాలను అందిస్తుందన్నారు. నేడు మహిళలు ఆర్థికాభివృద్ధి చెందారంటే అది కేవలం సెర్ప్ శాఖతోనేనని అన్నారు. బ్యాంకులు ఇస్తున్న స్త్రీనిధి రుణాలను మహిళా సంఘాలు గ్రామాలలో సద్వినియోగం చేసుకుని.. ప్రతి నెలనెల సక్రమంగా డబ్బులను చెల్లించుకోవాలన్నారు.బ్యాంకులో సక్రమంగా రుణాలు రీషెడ్యూల్ అయితేనే ఆ సంఘానికి మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. సక్రమంగా రుణాలు చెల్లించిన సంఘాలకు బ్యాంకు ద్వారా ప్రత్యేకంగా రుణాలు అందిస్తున్నారని తెలిపారు.వారి వెంట సీసీ దత్తు ఉన్నారు.



## రైతుల సమస్యలు పరిష్కరించండి

**ఆర్డీవోకు వినతిపత్రం అందజేసిన బీజేపీ నాయకులు**

ఎల్లారెడ్డి ఆగస్టు -23 (ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డి మండలంలోని రైతుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బిజెపి నాయకులు ఆర్డీవో పార్థసింహారెడ్డి, తహసిల్దార్ ప్రేమ్ కుమార్ కు వేర్వేరుగా వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు మాట్లాడుతూ ప్రభుత్వం రైతులకు సకాలంలో యూరియా సరఫరా చేసి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. రైతులకు సన్న వడ్ల యొక్క బోనస్ 500 రూపాయలు చెల్లించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోచారం కాలువ ద్వారా నీటి సరఫరాకు కెనాల్ లో ఉన్న పిచ్చి మొక్కలను తొలగించి చివరి ఆయకట్ట వరకు సాగునీరుని అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. గ్రామాల్లో పిచ్చికుక్కలు భారినుంచి ప్రజలకు రక్షణ కల్పించేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఆసుపత్రి నిర్మాణపు పనులను వేగవంతం చేసి 100 పడకల ఆసుపత్రి ని ప్రజల కోసం అందుబాటులో తీసుకురావాలని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన మధ్యాహ్న భోజనం అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పెద్దెడ్ల నర్సింలు, రాజేష్, దేవేందర్, మర్రి బాలకిషన్, ఎస్ ఎన్ రెడ్డి, ప్యాలాల రాములు, నరేష్, నర్సింహా రెడ్డి, అశోక్, రాములు, శంకర్, సాయిరెడ్డి, కాశినాథ్, మహేందర్, రాజు, బాలరాజు, రమేష్, గజానంద్, శివ, పందిరి తదితరులు పాల్గొన్నారు.

## మందకృష్ణ మాదిగకు ఘన సన్మానం



నాగిరెడ్డిపేట్,ఆగస్టు23(ప్రజాజ్యోతి): ఎమ్మార్పీఎస్ అధినేత పద్మశ్రీ అవార్డు గ్రహీత మందకృష్ణ మాదిగ మొట్టమొదటిసారిగా ఎల్లారెడ్డి నియోజకవర్గానికి వచ్చిన సందర్భంగా నాగిరెడ్డిపేట మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.ఎల్లారెడ్డి పట్టణంలో నిర్వహించిన వికలాంగుల మహాగర్జన సన్నాహక కార్యక్రమానికి వచ్చిన సందర్భంగా నాగిరెడ్డిపేట మండల శాఖ తరఫున పుష్ప గుచ్ఛం అందజేసి శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో నాగిరెడ్డిపేట మండల గౌరవ అధ్యక్షులు కుంటోళ్ల యాదయ్య మాదిగ మండల అధ్యక్షులు తొంట సాయిలు,రాజు,నాగరాజు,వివిధ గ్రామాల నుండి ఎమ్మార్పీఎస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

## సీసీ రోడ్డు పనులు ప్రారంభం

ఎల్లారెడ్డి ఆగస్టు -23(ప్రజా జ్యోతి ) ఎల్లారెడ్డి మండలంలోని జంగమాయపల్లి గ్రామంలో ఎమ్మెల్యే మదన్ మోహన్ ఆదేశాల మేరకు శనివారం మార్కెట్ కమిటీ చైర్మన్ రజిత వెంకట్రామిరెడ్డి ఆధ్వర్యంలో సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మార్కెట్ చైర్మన్ రజిత వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ జంగమాయపల్లి గ్రామంలో ఎస్సీ వాడలో రోడ్డు అధ్వాన్నంగా ఉన్న విషయాన్నీ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లడంతో ఎమ్మెల్యే వెంటనే చొరవ తీసుకొని సిఆర్ఆర్ నిధులతో 15 లక్షల సీసీ రోడ్డు పనులను ఇవ్వటం జరిగిందని తెలిపారు. సీసీ రోడ్డు అభివృద్ధి 15 లక్షల మంజూరు చేసినా ఎమ్మెల్యే మదన్ మోహన్ గ్రామస్తుల తరుపున ప్రత్యేక ధన్యవాదాలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కృష్ణా గౌడ్,మాజీ సర్పంచ్ నాగభూషణం, పౌలు, రాములు , పంచాయతీ సెక్రటరీ తదితరులు పాల్గొన్నారు.

## జెండా ఆవిష్కరణ

రామారెడ్డి ఆగస్టు 23 (ప్రజా జ్యోతి) రామారెడ్డి మండల కేంద్రంలో భవన నిర్మాణ రంగాల,కమిటీ ఆధ్వర్యంలో, మండలం లో గల రంగంపేట్, ఉప్పలవాయ్, గ్రామాలలో జెండా ఆవిష్కరణ, చేయడం జరిగింది, ఇట్టి, కార్యక్రమనికి, ముఖ్య అతిథిగా, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, ఉప్పు, సాయికుమార్, రామారెడ్డి మండల కమిటీ,టౌన్ ప్రెసిడెంట్ దేమే,రవిఅధ్యక్షులు బింగి ప్రసాద్,ప్రధాన కార్యదర్శి పూసల శివ, కోశాధికారి ఆకుల రాజయ్య కన్వీనర్,గంగాధర్ నారాయణ,జిల్లా ప్రధాన కార్యదర్శి మంగళపల్లి, నారాయణ, పందిరి శ్రీనివాస్, స్వామి, నరేష్ రాజశేఖర్, కుర్మా శ్రీనివాస్, తదితరులు, పాల్గొన్నారు.






## యూరియా కోసం తప్పని తిప్పలు

బిక్కనూరు ఆగస్టు 23 (ప్రజా జ్యోతి) భిక్కనూరు మండలంలోని అన్ని గ్రామాల కన్నా పెద్ద మల్లారెడ్డి గ్రామం అతిపెద్ద గ్రామం అని ,అందులోనూ పూర్తి వ్యవసాయ ఆధారిత గ్రామం కాబట్టి ,గత పది రోజుల నుండి యూరియా కోసం రైతులు ఎదురుచూపులు చూస్తుండగా, శనివారం ఉదయం ఐదు గంటల నుండి వరుస క్రమంలో నిలబడగా, బహిర్భూమికి వెళ్లాలంటే కూడా వరుసలో చెప్పులు పెట్టి వెళ్ళామని, పొలం వద్ద అన్ని పనులు మానుకొని యూరియా బస్తాల కోసం పడిగాపులు పడితే ,తీరా 250 బస్తాలు మాత్రమే రావడంతో రైతులు నిరాశకు గురయ్యారు.సహకార సంఘం కార్యదర్శి మోహన్ గౌడ్ ని ప్రశ్నించగా వచ్చిన దాంట్లో సరిపెట్టుకోవాలి దానికి నేనేం చేస్తా అని నిర్లక్ష్యంగా సమాధానం చెప్పడంతో, రైతులు గత పది సంవత్సరాలుగా లేని యూరియా కొరత ఇప్పుడే చూస్తున్నామని ఇది కేవలం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యానికి కారణమని మండిపడ్డారు.రైతుల పట్ల వివక్ష వైఖరితో కాంగ్రెస్ ప్రభుత్వం వ్యవహరిస్తుందని, ఇప్పటికైనా అధికారులు కళ్ళు తెరిచి రైతుల ప్రాణాలతో చెలగాటం ఆడొద్దని, "ప్రజా జ్యోతి "పత్రిక ద్వారా పెద్ద మల్లారెడ్డి గ్రామ రైతులు తమ బాధను చెప్పుకున్నారు.

## మొరం గుట్టలను మింగుతున్న బకాసురులు



బాన్సువాడ టౌన్ ప్రజా జ్యోతి ఆగస్టు 23. నసురుల్లాబాద్ మండలంలో నీ శివారులో గత కొన్ని రోజులుగా రాజకీయ నాయకుల అండదండలతో మొరం దందా రోజురోజుకు పెట్రేగిపోతుంది గుట్టలను సైతం వదలకుండా గుట్టలను మాయం చేస్తున్నా కేటుగాళ్లు ఎలాంటి అనుమతులు లేకుండా చడి చప్పుడు లేకుండా పగలనకా రాత్రనకా గుట్టల్ని మింగే బకాసురులు ఏదేచ్ఛా గుట్ట ని సైతం మింగేస్తున్నారు ఇక వివరాల్లోకి వెళితే నసురుల్లాబాద్ ఎమ్మార్వో సువర్ణ కు ఫిర్యాదు అందడంతో ఘటన స్థలానికి గిర్దవర్ ని పంపడం జరిగింది మొరం తవ్వకాలకు ఎలాంటి అనుమతి ఇవ్వలేదు ఎంక్వైరీ తదుపరి చర్యలు తీసుకుంటాము.



## సేవాఘడ్ తీజ్ ఉత్సవాలకు ఎమ్మెల్యేకు ఆహ్వానం

ఎల్లారెడ్డి ఆగస్టు - 23 (ప్రజా జ్యోతి) ఎల్లారెడ్డి మండలంలోని సోమార్యాగడితాండ గ్రామ పంచాయతీ పరిధిలోని సేవాఘడ్ లో ఆదివారం నిర్వహించబోయే తీజ్ ఉత్సవాలకు హాజరు కావాలని కోరుతూ ఎమ్మెల్యే మదన్మోహన్రావును ఆహ్వానించినట్లు కాంగ్రెస్ పార్టీ మండల ఉపాధ్యక్షుడు మాలోత్ గణేష్ నాయక్ తెలిపారు. శనివారం ఎమ్మెల్యే స్వగృహానికి వెళ్లి ఆహ్వాన పత్రిక అందజేసి తీజ్ ఉత్సవాలకు రావాలని కోరినట్లు ఆయన తెలిపారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే తప్పకుండా ఉత్సవాలకు హాజరవుతానని మాట ఇచ్చారని గణేష్ నాయక్ తెలిపారు. అలాగే తాండవాసులు అధిక సంఖ్యలో పాల్గొని తీజ్ ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## ఆధార్ సెంటర్ లను పునరుద్ధరించండి




రామారెడ్డి ఆగస్టు 23( ప్రజా జ్యోతి) రామారెడ్డి మండల కేంద్రంలో ఉన్న రెండు ఆధార్ సెంటర్లు గత కొద్ది రోజుల క్రితం ఒక ఆధార్ సెంటర్ కు సంబంధించిన వ్యక్తి రోడ్డు ప్రమాదంలో మరణించడం వలన ఆదార్ సర్వీస్ నిలిపివేయబడ్డాయి. అదేవిధంగా మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయం పరిధిలో ఉన్న మరో ఆధార్ సెంటర్ టెక్నికల్ ఇష్యూ వలన గత కొద్ది నెలల నుండి అందుబాటులో లేనందున ప్రజలకు ఇబ్బంది కలుగుతున్నాయని అదేవిధంగా చుట్టుపక్కల గ్రామాలకు చాలా ఇబ్బందిగా ఉండడం వలన ఇట్టి విషయాన్ని ఎమ్మెల్యే మదన్ మోహన్ రావు దృష్టికి తీసుకుపోగా వెంటనే ఫోన్ ద్వారా తాసిల్దార్ ని కలవాలని కాంగ్రెస్ కార్యకర్తలు తెలపడం జరిగిందని, ఈ విషయాన్ని తాసిల్దార్ ఉమలత కు తెలపడం ఈ విషయంపై స్పందించిన తాసిల్దార్ వెంటనే ఆధార్ అథారిటీ సెంటర్ కు ఫోన్ చేసి తెలుసుకోవడం జరిగింది.ఒక వారం రోజుల తర్వాత ఒక ఆధార్ సెంటర్ ను యధావిధిగా పనిచేయడం జరుగుతుందని తాసిల్దార్ తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు తూర్పు రాజు, సీనియర్ నాయకులు నామాల శంకర్, రామ్ సింగ్, మరియు పోసానిపేట్ రంగంపేట నాయకులు ఉన్నారు.

# నవరాత్రులకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చ

సిరికొండ: ఆగస్టు, 23 (ప్రజా జ్యోతి) రాబోయే వినాయక చవితి 27-8 - 2025 పండగ సందర్భంగా కలెక్టర్ ఆదేశా అనుసారంతో సిరికొండ తహసిల్దార్ ఆర్ రవీందర్ రావు, మండల స్థాయి అధికారులచే గణేష్ నిమజ్జనం నాడు తీసుకోవలసిన శాంతి భద్రతలు ఇతర ఏర్పాట్ల గురించి మండల స్థాయి అధికారులైన ఎంపీడీవో కే ఆర్ మనోహర్ రెడ్డి, సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జె రామకృష్ణ, విద్యుత్ ఏఈ చంద్రశేఖర్, డిప్యూటీ తహసిల్దార్ వై గంగాధర్, ఆర్ ఐ లు కే గంగారాజ్యం, నాగన్న, అనధికారులు సహకార మత్స్యశాఖ అధ్యక్షుడు శ్రీమాన్ లక్ష్మణ్, వీడీసీ చైర్మన్ ఇందూరు స్వామి, వారితో సమావేశం ఏర్పాటు చేసి గణేష్ మండపాలవారు నవరాత్రులు తీసుకోవలసిన జాగ్రత్తలు చర్యలపై సమావేశంలో చర్చించడం జరిగింది. అనంతరం తహసిల్దార్ మాట్లాడుతూ.. విద్యుత్తు వల్ల ఏ అపాయం జరగకుండా క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి గణేష్ మండలి వారికి తగు సూచనలు సలహాలు ఇవ్వాలని విద్యుత్ అధికారి చంద్రశేఖర్ కూ ఆదేశించారు. నవరాత్రులు శోభాయాత్ర రోజు సందర్భంగా గొడవలు జరగకుండా భారీ బందోబస్తు నిర్వహించాలని సిరికొండ సబ్ ఇన్స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జె రామకృష్ణకు సూచించారు. శోభయాత్ర రోజు కుంటలు చెరువుల దగ్గర గణేష్ నిమజ్జనం రోజున ఇరిగేషన్ అధికారులు పర్యవేక్షించి ప్రజలు నీటిలోకి



దిగకుండా గణపతుల నిమజ్జనానికి ఏర్పాటు చేసిన వారే నీటిలోకి వెళ్లి నిమజ్జనం నిమజ్జనం చేసే విధంగా చూడాలని అన్నారు.

## ఘనంగా పొలాల అమావాస్య



రెంజల్,ఆగస్ట్ 23 (ప్రజాజ్యోతి): రెంజల్ మండలంలో శనివారం ఎడ్ల పొలాల అమావాస్య పర్వదిన పండుగను రైతన్నలు ఘనంగా జరుపుకున్నారు. ఆనవాయితీగా వస్తున్న ఈ పండగను రైతులు బసవన్నలకు ప్రత్యేక పూజలు చేసి గ్రామంలోని హనుమాన్ మందిరం చుట్టూ ప్రదక్షిణలు చేసిన అనంతరం తమ తమ ఇళ్లలోకి బసవన్నాలను తీసుకెళ్లారు. పోలాల అమావాస్య పర్వదిన సందర్భంలో బసవన్నలను రైతులు గతంలో రంగులతో అలంకరించి భాజ భజంత్రీల మధ్య గ్రామంలో ఊరేగింపు నిర్వహిస్తుండేవారు. నేటి యుగంలో బసవన్నలకు బదులుగా వ్యవసాయ పనులలో ట్రాక్టర్లను వాడుతున్న సందర్భంగా రైతన్నలు బసవన్నలకు బదులుగా ట్రాక్టర్లను హనుమాన్ మందిరం చుట్టూ తింపి అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు మాట్లాడుతూ గతంలో భూములు సాగు చేయడానికి ఎడ్లు ఎంతగానో దోహదపడేవని కానీ కాలక్రమేణ అభివృద్ధిలో భాగంగా యాంత్రీకరణ పనిముట్లతో భూములను సాగు చేస్తున్న తరుణంలో గత కొన్ని సంవత్సరాల నుండి సాటాపూర్ గ్రామంలో బసవన్నలకు బదులుగా యాంత్రికరణాలు అయిన ట్రాక్టర్లతో ఎడ్ల పొలాల అమావాస్య పండుగ జరుపుకుంటున్నామని అన్నారు. ఎడ్లకు బదులుగా ట్రాక్టర్లను అలంకరించి గ్రామంలోని ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు చేసి ప్రధాన వీధుల్లో ర్యాలీ నిర్వహించి తర్వాత తమ ఇండ్లలోకి యాంత్రికరణాలను తీసుకెళ్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామకమిటీ సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత



మాక్లూర్ ఆగస్టు 23 (ప్రజా జ్యోతి ) నేరాల నియంత్రణకే కమ్యూనిటీ కాంటాక్టు ప్రోగ్రాం నిర్వహిస్తున్నామని నిజామాబాద్ ఏసిపి రాజా వెంకటరెడ్డి పేర్కొన్నారు. శనివారం మాక్లూర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని మహాలక్ష్మి నగర్ లో నిర్వ హించారు. ఇందులో భాగంగా కాలనీలోని అనుమానిత ప్రాంతాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఏరియాకు కొత్తగా వచ్చిన వ్యక్తుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఏ సి పి మాట్లాడుతూ.. ప్రజల రక్షణే పోలీసుల బాధ్యత అని, ప్రజలందరు పోలీసులకు సహకరించాలన్నారు. గ్రామాల్లోకి ఎవరైనా కొత్త వ్యక్తులు వచ్చినా, అనుమానస్పదంగా కనిపించినా పోలీసులకు సమాచారం అందించాలన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. వ్యాపార సముదాయాలు, కాలనీల వద్ద సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవా లని, సీసీ కెమెరాల ద్వారా భద్రత ఉంటుందని, నేరస్తులను, దొంగల ను త్వరగా గుర్తించవచ్చని తెలిపారు. రాబోయే గణేష్ ఉత్సవాలను శాంతియుత వాతావరణం లో నిర్వహించుకోవాలని సూచించారు. అలాగే సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో నార్త్ రూరల్ సీఐ శ్రీనివాస్, వన్ టౌన్ సీఐ రఘుపతి, మాక్లూర్ ఎస్సై రాజశేఖర్, సబ్ డివిజన్ పరిధిలోని ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## దివ్యాంగుడికి 10 వేల ఆర్థిక సహాయం

సిరికొండ: ఆగస్టు, 23 (ప్రజా జ్యోతి) వసుధ ఫౌండేషన్ వారిచే అంగవైకల్యం గల బాలయ్యకు పదివేల ఆర్థిక సహాయం. సిరికొండ మండలం పోత్నూర్ గ్రామానికి చెందిన డీలర్ బాలయ్య ఇటీవల అనారోగ్యం బారిన పడి ఎడమ కాలు తీసివేయడం జరిగింది. బాలయ్య అంగవైకల్యం గూర్చి సిరికొండ మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు నారబోయిన శ్రీనివాస్ వసుధ ఫౌండేషన్ నిజామాబాద్ ఆర్గనైజర్ వడియాల పురుషోత్తం రెడ్డికి వివరించగా ఆయన మంచి హృదయంతో బాలయ్యకు శ్రీనివాస్ ధర పదివేల చెక్కును అందించడం జరిగింది. దీనికి బాధితుడు బాలయ్య తన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు.

## మట్టి గణపతులను ఏర్పాటు చేద్దాం పర్యావరణాన్ని రక్షిద్దాం

సిరికొండ: ఆగస్టు, 23 (ప్రజా జ్యోతి) సిరికొండ మండల కేంద్రంలో గల పీ యం తెలంగాణ ఆదర్శ పాఠశాల కళాశాలలో శనివారం ఏకో క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులు మట్టి గణపతులను తయారు చేసి వాటికి రంగులు వేసి తమ సృజనాత్మకతను ప్రదర్శించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ జి. రాజేష్ రెడ్డి మాట్లాడుతూ..

"ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాల వలన నీరు, నేల కలుషితమవుతాయి. జలచరాల ప్రాణాలకు ముప్పు ఏర్పడుతుంది. కానీ మట్టి గణపతులు మాత్రం సహజంగా కరిగిపోతాయి. ఇవి ప్రకృతికి మేలు చేస్తాయి. మీరు చిన్న వయసులోనే మట్టి గణపతులను తయారు చేయడం ద్వారా సమాజానికి పర్యావరణ పరిరక్షణపై మంచి సందేశం ఇస్తున్నారు. పండుగ అనేది భక్తితో పాటు బాధ్యతను కూడా కలిగి ఉండాలి. అందరం కలసి పర్యావరణానికి హాని చేయని మట్టి గణపతులనే ఏర్పాటు చేసుకోవాలి. ఇదే నిజమైన గణేశ భక్తి" అని ఆయన విద్యార్థులకు బోధించారు. ఈ కార్యక్రమంలో ఏకో క్లబ్ ఇన్‌చార్జ్‌లు జమున, సాయి వినయ్, రాజేందర్ పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు. విద్యార్థులు స్వయంగా మట్టి గణపతులను తయారు చేసి పర్యావరణ హిత రంగులతో అలంకరించి అందరినీ ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలోఉపాధ్యాయులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## 13 మంది బైండోవర్

సిరికొండ: ఆగస్టు, 23 (ప్రజా జ్యోతి) నిజామాబాద్ జిల్లా బోధన్ డివిజన్ లోని బోధన్ పోలీస్ స్టేషన్ 2, బోధన్ రూరల్ పోలీస్ స్టేషన్ 5, ఎడపల్లి పోలీస్ స్టేషన్3, రుద్రూర్ పోలీస్ స్టేషన్3 మొత్తం 13 మందిని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి సాయి చైతన్య ముందు బైండోవర్ చేయడం జరిగింది. గణేష్ విగ్రహాల నిమజ్జనం, మిలాద్- ఉన్- నబి, దుర్గామాత ఉత్సవం సందర్భంగా అదనపు జిల్లా మెజిస్ట్రేట్ అండ్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నిజాంబాద్ ఆదేశాల ప్రకారం డీజే ఆపరేటర్లు, డీజే యజమానులు, ట్రబుల్ మాంగర్స్, బోధన్ డివిజన్ పరిధిలో వివిధ పోలీస్ స్టేషన్లలో గతంలో నమోదైన కేసులోని నిందితులను వచ్చే ఆరు నెలల పాటు సత్ప్రవర్తనను కొనసాగించుటకు డీజే ఆపరేటర్లుకు, డీజే యజమానులకు, 3 లక్షలు, ట్రబుల్ మాంగర్స్ కు 50 వేల రూపాయల సొంత కూచికత్తుపై పి సాయి చైతన్య ఐపీఎస్ ముందు బైండోవర్ చేయబడ్డారు.

## జానకంపేట లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో చిరు వ్యాపారుల దోపిడీ

ఎడపల్లి ఆగస్ట్ 23 (ప్రజాజ్యోతి) నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలం జానకంపేట గ్రామ శివారులో గల ప్రసిద్ధి పొందిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయం ఉంది. ఆలయ జాతర ఉత్సవాల సందర్భంగా శనివారం అమావాస్య శనివారం పౌర్ణమి సందర్భంగా ఆలయానికి భక్తులు సుదూర ప్రాంతాల నుండి తరలివస్తారు. ఇదే సమయంలో ఆలయ కమిటీ అధికారులు ఆలయానికి ఆదాయం రావాలని వేలం పాట నిర్వహిస్తారు. ఇది భక్తులకు చుట్టుపక్కల గ్రామస్తులకు తెలిసిన విషయమే, కాగా ఇటీవల శనివారం అమావాస్య సందర్భంగా ఆలయ అధికారులు వేలంపాట నిర్వహించారు. కొబ్బరికాయలు నవధాన్యాలతో పాటు పూజ సామాగ్రి అన్ని కలుపుకొని వేలం పాట నిర్వహించగా నిజామాబాద్ పట్టణానికి చెందిన ఓ వ్యాపారి వేలం పాటలో 48 వేయిల రూపాయలకు దక్కించుకున్నారు. శనివారం అమావాస్య సందర్భంగా నిజామాబాద్ జిల్లా చుట్టుపక్కల గ్రామాలే కాకుండా ఇతర ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఇదే ఆసరాగా భావించిన పూజా సామాగ్రి వ్యాపారి నిబంధనల ప్రకారం కొబ్బరికాయలతో పాటు నవధాన్యాలు పసుపు కుంకుమ అగర్బత్తిలు విక్రయించాల్సి ఉంది. కానీ భక్తజనం ఎక్కువ కావడంతో చిరు వ్యాపారి అందిన కాడికి దండుకుంటూ కొబ్బరికాయకు 40 రూపాయలు, నవధాన్యాలకు 20 రూపాయల చొప్పున డబ్బులు దండుకుని పూజ సామాగ్రి లో ముఖ్యమైన పసుపు కుంకుమ అగర్బత్తులను ఇవ్వకుండా భక్తుల మనోభావాలను దెబ్బతీసేలా వ్యవహరించారని భక్తులు మండిపడ్డారు. ఈ విషయమై ఆలయ అధికారులను వివరణ కోరగా చిరు వ్యాపారి కొబ్బరికాయ,నవధాన్యాలతో పాటు పూజ సామాగ్రి ఇవ్వడంలేదనే విషయం తమ దృష్టికి రాలేదని పాత్రికేయుల ద్వారానే విషయం తమ దృష్టికి వచ్చిందని చెప్పడం ఆలయ అధికారుల పనితీరుకు నిదర్శనం. దేవాదాయ ధర్మాదాయ శాఖ అధికారులు దృష్టి సారించి ఆలయంలో మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోని భక్తుల మనోభావాలను కాపాడతారో లేదో చూడాలి మరి.

## టాప్ మార్కులు సాధించిన విద్యార్థులకు బహుమతుల అందజేత



ఇంగల్వాయి ( ప్రజా జ్యోతి ) ఆగస్టు,23 ఇందల్వాయి మండల కేంద్రంలోని ఎల్లారెడ్డిపల్లి గ్రామంలో.జిల్లా పరిషత్ హై స్కూల్లో పదవ తరగతిలో టాప్ మార్కులు సాధించిన కుమారి రుచిత దీపిక శ్రీహితలకు ఎల్లారెడ్డి పల్లె మాజీ సర్పంచ్ మటముల శేఖర్ గారు. మనోహరాబాద్ మాజీ సర్పంచ్ పాటుకూరి తిరుపతిరెడ్డి. తన సొంతంగా టెన్త్ క్లాసులో అత్యధికంగా మార్పులు తెచ్చుకున్న. ముగ్గురు అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందజేయడం. జరిగింది ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ వచ్చే సంవత్సరం ఇంకా అత్యధిక మార్కులు తెచ్చుకొని మంచి మార్కులు సాధించిన వారికి ఆర్థిక సహాయము పెంచుతామని హామీ ఇవ్వడం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ ఉపాధ్యాయులు బిజెపి మాజీ అధ్యక్షులు నాయుడి రాజన్న పులి శ్రీనివాస్ బాబురావు గ్రామస్తులు వీడిసి సభ్యులు విద్యార్థిని విద్యార్థులు పాల్గొనడం జరిగినది.

## గ్రామ సంఘ కార్యకర్తలకు రివ్యూ సమావేశం

కమ్మర్ పల్లి ఆగస్టు 23,ప్రజా జ్యోతి. కమ్మర్ పల్లి మండల కేంద్రంలో మహిళ భవనం లో శనివారం రోజున రివ్యూ సమావేశం నిర్వహించినట్లు ఐకేపీ ఏపీఎం గోపు.కిరణ్ కుమార్ తెలిపారు. సామాజిక చేకూర్పుకార్య క్రమంలో భాగంగా విఓఏ లతో సమావేశం జరిపి నాలుగు రకాల వృద్ధాప్య, దివ్యాంగుల, కిషోర బాలికల, సాధారణ, నూతన సంఘాల ఏర్పాటు చేయాలని చెప్పడం జరిగింది. బ్యాంక్ లింకేజ్, స్త్రీనిధి టార్గెట్ లు 100% అచీవ్మెంట్ చేయాలి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టిన లబ్ధిదారులకు మహిళా సంఘాల నుండి ఋణాలు మంజూరు చేయాలని సంఘాల, గ్రామ సమాఖ్య ల పుస్తకాలు అప్డేట్ ఉండాలి. అజీవిక రిజిస్టర్ 100శాతం పూర్తి చేయాలని చెప్పారు. లో సీసీ లు రవి, శ్రీనివాస్ సుంకరి.నవీన్ కుమార్, భాగ్య లక్ష్మి, పీర్యా, అలేఖ్య మండల సమాఖ్య ప్రతినిధి వాసవి, మరియు అన్ని గ్రామ సంఘాల వి ఓఏ లు పాల్గొన్నారు.

# సీజనల్ వ్యాధులతో అప్రమత్తంగా ఉండాలి

భిక్కనూరు ఆగస్టు 23 (ప్రజా జ్యోతి) భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామంలో గల ప్రాథమిక ఆరోగ్యం ఉపకేంద్రాన్ని శనివారం మధ్యాహ్నం జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్ వన్ ఆకస్మిక తనిఖీ చేశారు.ఇందులో భాగంగా ఉపకేంద్రంలో ఉన్నటువంటి సదుపాయాలు మరియు మందుల నిలువలు,పరిసరాల పరిశుభ్రత అదేవిధంగా రికార్డుల పరిశీలన చేశారు.అదేవిధంగా సిబ్బందితో మాట్లాడి సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు రోగుల ఆరోగ్య పరిస్థితిని పర్యవేక్షించాలని సూచించారు . కార్యక్రమంలో వైద్యాధికారియమీమా, వైద్య అధికారి విద్య ,ఆరోగ్య విస్తరణాధికారి వెంకటరమణ, మరియు తాసిల్దార్ సునీతాదేవి,మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజ్ కిరణ్ రెడ్డి ,మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ మరియు ఆశ సిబ్బంది పాల్గొన్నారు.

## బిల్లులు సకాలంలో అందుతున్నాయా

బిక్కనూరు ఆగస్టు 23 (ప్రజా జ్యోతి) భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ లో నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇండ్ల పనులను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ..నాణ్యమైన ఇటుక, సిమెంటు,ఇసుక వాడుతూ సకాలంలో ఇండ్ల నిర్మాణం పూర్తి చేయాలని తెలిపారు.అదే విధంగా లబ్ధిదారులతో మాట్లాడుతూ బిల్లులు సకాలంలో అందుతున్నాయా? లేదా? అని అడిగి తెలుసుకున్నారు .లబ్ధిదారులకు ఎటువంటి ఇబ్బంది కలగకుండా వేగంగా ఇల్లు నిర్మాణాలు చేయాలని సిబ్బందిని ఆదేశించాడు.ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్, హౌసింగ్ ఏఈ లహరి, తహసిల్దార్ సునీత దేవి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజ్ కిరణ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.





## ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను అభినందించిన కలెక్టర్.

బిక్కనూరు ఆగస్టు 23 (ప్రజాజ్యోతి) భిక్కనూరు మండలంలోని బస్వాపూర్ గ్రామంలో జిల్లా పరిషత్ హై స్కూల్ ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ తనిఖీలో భాగంగా పాఠశాలల్లోని ప్రతి తరగతి గదిని పరిశీలించారు.ప్రయోగశాలలో పిల్లలతో ప్రయోగాలు చేయించారు.అదేవిధంగా పదవ తరగతి విద్యార్థులను ప్రశ్నలు అడగగా వారు సరైన సమాదానాలు చెప్పడంతో సంతోషించి పదిమంది విద్యార్థులకు బహుమతులు ఇవ్వడం జరిగింది .విద్యార్థులను క్రీడల పట్ల అడిగి తెలుసుకున్నారు.మరియు పరిసరాలను, వంటశాలను, మరుగుదొడ్లను పరిశీలించాడు.ఈ సందర్భంగా మండల విద్యాధికారి రాజగంగారెడ్డిని మరియు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వెంకటేష్ నీ ప్రత్యేకంగా అభినందించాడు.రానున్న కాలంలో ప్రైవేటు పాఠశాలలు లేకుండా చేసి ప్రభుత్వ పాఠశాలలు ఆదర్శంగా నిలవాలని ఆయన తెలిపారు.తద్వారా పేద మధ్య తరగతి విద్యార్థుల కు ఫీజుల భారం ఉండదని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి శ్రీనివాస్ ,మండల విద్యాధికారి రాజగంగారెడ్డి ,తహసిల్దార్ సునీతాదేవి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి రాజ్ కిరణ్ రెడ్డి మరియు పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

# మొక్కజొన్న పొలంపై అడవి పందుల దాడులు

గాంధారి ఆగష్టు 23 (ప్రజాజ్యోతి) గాంధారి మండలంలోని గుడిమెట్ గ్రామ రైతులు అడవి పందుల బారిన పడి తీవ్ర ఆందోళనకు గురయ్యారు. స్థానిక రైతులు ఆర్ల నడిపోల్ల బలవంతరావు, ఉమ్మెడ బోజారావు పొలాల్లో పండించిన మొక్కజొన్న పంటను అడవి పందులు ధ్వంసం చేశాయి.వారి ప్రకారం సుమారు 5 నుండి 6 ఎకరాల పంట నాశనం కాగా, దాదాపు రూ.3 లక్షల మేర నష్టం జరిగినట్లు తెలిపారు. అనేక కష్టాలు పడి సాగు చేసిన పంట ఒకే రాత్రిలో నాశనం కావడంతో రైతులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.మా బాధను ఎవరికీ చెప్పుకోవాలో తెలియడం లేదు. కనీసం ప్రభుత్వం మాకొకటే దిక్కు" అని రైతులు వేదన వ్యక్తం చేస్తూ, తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ప్రభుత్వాన్ని వేడుకున్నారు.



